

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 4 సంచిక : 12 పుష్పం : 15 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 1-12-98 కేశవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కర్మనుయోగంగా చేయి నీవు పవిత్రుడవు అవుతావు అని గీతలో భగవంతుడు చెప్పాడు. పవిత్రత లేకపోతే ఆధ్యాత్మికంగా నీవు ఏమీ ప్రగతిని పొందలేవు. కర్మయోగం యొక్క ప్రాముఖ్యత గురించి గీతలో భగవంతుడు చెప్పాడు. భవనానికి పునాది ఎటువంటిదో ఆధ్యాత్మిక పురోభివృద్ధికి కర్మయోగం అటువంటిది. కర్మను యోగంగా చేయటంవలన చిత్తశుద్ధి కలుగుతుంది. ఎవడికైతే చిత్తశుద్ధి కలిగిందో వాడి మనస్సు హృదయంలోనికి వెళ్ళికరిగిపోతుంది. ఏహృదయంలో అయితే పరమాత్మ ఉన్నానని చెప్పాడో ఆహృదయం యొక్క పవిత్రత, సౌందర్యం, నిర్మలత్వం గురించి ఊహించలేము. అది అవ్వటానికి ప్రయత్నం చెయ్యాలిగాని ఊహిస్తే అందేదికాదు. మంచిచేసిన వాడికి దుర్గతిలేదు అని భగవంతుడు చెప్పాడు. మంచిచెయ్యాలని అనుకోవటంవేరు, చెయ్యటంవేరు. అభ్యాసం చెయ్యాలి. ఎలా అభ్యాసం చెయ్యాలి అనేది గీతలో భగవంతుడు వివరంగా చెప్పాడు. భగవంతుడు చెప్పిన ప్రతీమాట నూటికి నూరుపాళ్ళు సత్యం. కాని మనమనస్సు మనలను భ్రాంతిలో పెడుతుంది. నిజాన్ని అనిజంక్రింద, ఆనిజాన్ని నిజంక్రింద చూపిస్తుంది. మనం బాగుపడటానికి గీతలో ఉన్న ఒక్క శ్లోకం చాలు. అన్ని శ్లోకాలు మంచివే. కాని మీ మానసికప్రవృత్తికి అనుకూలమైన శ్లోకాలు తీసుకొని ప్రాక్టీసు చెయ్యాలి. ముందు అధ్యయనం చెయ్యాలి, తరువాత అర్థం చేసుకోవాలి, అర్థం చేసుకొంటే ఆచరించాలనే బుద్ధి పుడుతుంది. ఆచరించిన తరువాత అనుభవంలోనికి వస్తుంది.

మీరు చెయ్యవలసిన పనిని శ్రద్ధగా చెయ్యండి. ఫలితం ఆయన చేతిలో ఉంది. ఎప్పడు ఎక్కడ ఎలా చెయ్యాలో ఆయన చేస్తాడు. దేనికి కంగారు పడవద్దు. జరగవలసిన కాలం వచ్చినప్పడు పని పూర్తి అవుతుంది. భౌతికమైన పనులు కూడా కాలం వచ్చినప్పడు అవుతాయి. ఆత్మజ్ఞానం కూడా అంతే. మనం కృషి చేయాలి, అప్పడు కాలం కలిసివస్తుంది, పొందవలసిన

టైములో పొందుతాము. నేను చాలాసాధన చేస్తున్నాను. చాలా కృషి చేస్తున్నాను అని నీవు అనుకొంటే అది భక్తికాదు, అది శరణాగతికాదు. నీకు చేతులు ఉన్నాయి పనిచేస్తున్నావు, కాళ్ళు ఉన్నాయి నడుస్తున్నావు, నీకు బుద్ధి ఉంది కదా దానితో ఎందుకు ఆలోచించుకోవు అంటున్నారు భగవాన్. బుద్ధితో ఆలోచించటం నేర్చుకో. ప్రమాదంలో పడకు, మోహంలో పడకు. బుద్ధిని నిదానంగా ఉంచుకో. నీకంటే ఎక్కువ చైతన్యస్థాయి ఉన్నవారితో, ఎక్కువ దైవీసంపద ఉన్నవారితో సహవాసం చెయ్యటం నేర్చుకో. మహాత్ముల సన్నిధిలో దేహబుద్ధి నెమ్మదిగా కరిగిపోతుంది, పునర్జన్మ కారణాలు నశిస్తాయి, నీవు పవిత్రుడవు అవుతావు, నీకు ఏకాగ్రత కలుగుతుంది, పరమాత్మలో ఐక్యం అవుతావు. కురుక్షేత్రం మనలోపలే ఉంది. మంచిగుణాలు పాండవులు, చెడుగుణాలు కౌరవులు. మనలోపల వాటికి యుద్ధం జరుగుతోంది. కృష్ణ పరమాత్మ సహాయం లేకపోతే పాండవులు నెగ్గలేరు. మంచి గుణాలకు, చెడుగుణాలకు యుద్ధం జరిగినప్పుడు చెడుగుణాలు నశించాలంటే సాధనాబలం ఉండాలి, గురువు అనుగ్రహం ఉండాలి. కొంతమంది స్వభావం మంచిగా ఉంటుంది స్నేహితులు చెడ్డవారయితే వాళ్ళు పాడయిపోతారు. ఎందుచేతనంటే బాహ్యమైన ప్రలోభాలకు, మోహాలకు లొంగకుండా ఉండటం జీవుడికి చాలా కష్టం. లోకంలో మనలను పాడుచేసే ఆకర్షణలు ఎన్నో ఉన్నాయి. ఒక్కఆకర్షణకు గురి అయిన మనం పతనమవుతాము.

దేహం ప్రారబ్దం ప్రకారం నడుస్తుంది. నీవు దేహంతో తాదాప్యం పొందటమా లేక నీలోపల ఉన్న చైతన్యంతో తాదాప్యం పొందటమా అనే స్వేచ్ఛ పరమేశ్వరుడు నీకు ఇచ్చాడు. కృష్ణుడు ఎన్నో యుద్దాలు చేసాడు. బోయవాడు బాణంతో కొడితే చనిపోయాడు అంటే అది ఆయన దేహప్రారబ్దం. దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టు. పరమాత్మతో తాదాప్యం పొందటం వలన ఈ ప్రారబ్దాన్ని నేను అనుభవిస్తున్నాను అనే నేను పోతుంది. నీవు విచారణామార్గంలో ప్రయాణం చేసినా, శరణాగతిమార్గంలో ప్రయాణం చేసినా పోగొట్టుకోవలసింది ఈ దేహగతమైన నేనునే. నీవివేకంతోటి, నీ పరిశీలనాత్మక బుద్ధితోటి ఈ దేహగతమైన నేనును పోగొట్టుకో. అంత వివేకం నీకు లేకపోతే ఈ నేనును పరమేశ్వరుడికి ఇచ్చివేస్తే ఆయన దానిని చించేస్తాడు. నీ హృదయంలో ఉన్న ఆనందం నీచేతికి అందకుండా ఈ దేహగతమైన నేనే అడ్డువస్తోంది. అందువలన ఏదో మార్గంలో దీనిని తొలగించు. ఆలోచన, విశ్వాసం రెండూ పోషించుకో. నీ ఆలోచనకు విషయం ఎంతవరకు అందుతోందో అంతవరకు ఆలోచనను ఉపయో

గించుకో. నీ ఆలోచనకు అందని పరిస్థితి వచ్చినప్పుడు విశ్వాసం మీద ఆధారపడు. నీకు దేహాభిమానం బలంగా ఉంది అంటే నీవు విచారణ వదిలివేసావు కాబట్టి అది బలపడుతోంది. విచారణ చేస్తూ ఉంటే దేహాభిమానం తగ్గుతుంది అంటున్నారు భగవాన్. నీవు సాధన చేసినా చేయకపోయినా, నీకు దేహాభిమానం ఉన్నా లేకపోయినా నీ హృదయంలో ఉన్న సత్యమే నీవు. అది నీకు తెలియకపోవచ్చును. హృదయంలో ఉన్న సత్యానుభూతి నీకు కలిగినప్పుడు ఆనందమే ఆనందము, శాంతేశాంతి, సుఖమే సుఖము. నీహృదయంలో ఉన్న సుఖం రవ్వంత, ముల్లంత నీసహస్రారానికి అందినా అది నిన్ను హృదయంలోనికి లాగుకొనిపోతుంది. నీహృదయంలో ఉన్న ఆనందం నీ మనస్సుకు అర్థమయినప్పుడు ఆరుచి నీమనస్సుకు తెలిసినప్పుడు దానంతట అదే దాని మూలంలోనికి వెళ్ళి ఐక్యమవుతుంది. నీహృదయంలో ఉన్న సత్యం తెలిస్తే నీవు నిజస్థితిని పొందుతావు, తెలియకపోతే అనిజంలో ఉంటావు. అనిజంలో ఉన్నంతకాలం ప్రకృతినిన్ను విడిచిపెట్టదు, రంపాన్ని పెట్టి రాస్తుంది. కామం యొక్క వేగం, క్రోధం యొక్క వేగం తట్టుకోవటం చాలాకష్టం. ఎవడైతే వాటి యొక్క వేగాన్ని తట్టుకొంటున్నాడో వాడు యోగి అవుతాడు. సాధనచేసి, సాధనచేసి ఎవడైతే కామాన్ని ప్రేమగా మార్చుకొంటున్నాడో, కోపాన్ని శాంతిగా మార్చుకొంటున్నాడో వాడు ధన్యజీవి అవుతాడు, ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది.

ఏదైతే నిజంకాదో దానివెంట పరుగెడుతున్నావు. అందుచేత ఏది నిజమో నీకు తెలియటంలేదు. మూడు అవస్థలలోను నీవు ఉన్నావు. ఈమూడు అవస్థలు మనస్సుకే. అది చిరిగిపోతే ఏమీలేదు. లోకం ఉంది అని లోకం చెప్పటంలేదు నీమనస్సు చెపుతోంది. మనస్సు అణిగిపోతే లోకంకూడా అణిగిపోతుంది. నువ్వుకాని మనస్సువైపుకు, నవ్వుకాని రజోగుణ వికారములవైపుకు పరుగుపెట్టవద్దు. లోపలకు చూడటం నేర్చుకో. అప్పుడు లోపల ఉన్న వస్తువు నీకు వ్యక్తమవుతుంది. అది వ్యక్తమయిన తరువాత ఇదే అంతటా ఉన్నది, అంతటా ఉన్న దానికి దీనికి ఏమీ బేధంలేదు అని నీకు తెలుస్తుంది. నిష్కామకర్మ ఎంతోకొంత చేస్తేనే నీకు సద్బుద్ధి కలుగుతుంది, సహృదయం కలుగుతుంది. నిష్కామకర్మ చేస్తే హృదయం విశాలమవుతుంది. గాంధీగారికి మనకు తేడా ఏమిటి అంటే మనం ఇంటిలో ఉన్న వ్యక్తులు మన కుటుంబం అనుకొని ఆకుటుంబంకోసం ఎలా పని చేస్తామో అలాగే దేశంలో ఉన్న మనుషులు అంతా తనవారు అనుకొని దేశం కోసం ఆయన పనిచేసాడు. అందుకే ఆయన

మహాత్ముడు అయ్యాడు అంతకంటే తేడాఏమీలేదు. మనం ఇంటిలో ఉన్న మనుషులతో తాదాప్యం పొందుతాము. ఆయన దేశంతో తాదాప్యం పొందాడు అందువలన ఆయన కార్యరంగం విశాలమయింది. మనం ఇంటిలోని వ్యక్తులకు పరిమితమై పనిచేస్తున్నాము కాబట్టి మన మనస్సు ఇరుకై పోయింది.

మీకు ఇష్టమైన మార్గములో ప్రయాణం చేయండి. ఏమార్గమైనా మోక్షానికి తీసుకొని వెళుతుంది. ఒకమార్గం ఎక్కువ, ఒక మార్గం తక్కువ అని ఏమీలేదు. ఇందులో అనుకరణవద్దు. అనుకరణ పిరికివాని లక్షణము. నిష్కామకర్మవలన మనస్సులోని దోషములు పోతాయి. అప్పుడు భగవంతుని మీద భక్తి కలుగుతుంది. భక్తిలోనుండి ఆత్మజ్ఞానం కలుగుతుంది. అన్ని మార్గములు ఒకదానికి ఒకటి సహకరిస్తాయి. శివుడిని తెలుసుకొనేవరకు ప్రతీజీవుడికి శవాలు వచ్చి తీరుతాయి. పునర్జన్మ ఎందుకు ఇచ్చాడు అంటే మనం పవిత్రులము అవ్వటం కోసం. అంటే మనలను మనం బాగుచేసుకోవటానికి పునర్జన్మ ఒక అవకాశం. అవకాశమును ఉపయోగించుకొని నీవు పవిత్రుడవు అవ్వటానికి ప్రయత్నం చెయ్యి. భగవంతుడు రెండు ఉపకారములు చేస్తున్నాడు. ఒకటి రాబోయే జన్మను అంటే శరీరమును ఇస్తున్నాడు సాధన చేసుకోవటానికి. రెండు గతజన్మ గొడవలు అన్నీ మరుపుపెడుతున్నాడు. గతజన్మలో గొడవలు మరుపు పెట్టకపోతే అవి జ్ఞాపకంవస్తే మనం వెనుకకు ప్రయాణం చేస్తాముగాని ముందుకు వెళ్ళలేము. అబద్ధమైన నేనుకు తలంపులు ఉన్నాయి. నిజమైన నేనుకు తలంపులు లేవు. ఈ తలంపులను దాటివెళితే, తలంపులు లేనిస్థితిని పొందితే అప్పడు నీవు కామక్రోధములను దాటివెళతావు, జనన మరణ ప్రవాహమునుండి బయటకు వచ్చేస్తావు. నీ హృదయంలో ఒక చావులేనిస్థితి ఉంది. ఈ మారేమనస్సును, చనిపోయేదేహాన్ని ఆ చావులేనిస్థితిని పొందటానికి ఉపయోగించుకో అన్నారు భగవాన్. లోకంలో అనేక ఆకర్షణలు ఉంటాయి. అందులో దేనికి లోబడినా నీవుదారి తప్పిపోతావు, మార్గమును వదిలి వేస్తావు. భగవంతుని వైపుకు నీమొఖం త్రిప్పకుండా ప్రకృతిని నీవు జయించలేవు. అంటే భగవంతుని వైపుకు నీ మొఖం త్రిప్ప నీవీపును ప్రకృతికి చూపించు అప్పడు ప్రకృతిని జయిస్తావు.

PRINTED & PUBLISHED BY P.S. RAMARAJU AT SHRIRAM GRAPHICS, PALAKOL